# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 321 | మంగళవారం 16 జూలై 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri





# ఉద్యోగాలపై కాంగ్రెస్ రూట్‌మ్యాప్

తెలంగాణ రాకముందు ఏళ్లుగా పోరాటం.. తెలంగాణ వచ్చాక కూడా పదేళ్లుగా పోరాటం.. దేనికి ఉద్యోగాల కోసం. ఉన్న ఇంటిని విడిచి.. కోచింగ్ సెంటర్లకు వేలల్లో ఫీజులు కట్టి.. సగం తిని.. తినకా చెట్ల కింద కూర్చొని చదివేది ఎందుకు.. ? నోటిఫికేషన్లు పడతాయని.. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో నోటిఫికేషన్లు వచ్చి ఉద్యోగాలు సాధించే సమయం వచ్చే సరికి మళ్లీ అవే ఆందోళనలు. ఈసారి నోటిఫికేషన్లను వాయిదా వేయాలని.. ఇదేక్కడి లాజిక్.. ? మనం ఇన్నేళ్లుగా పోరాటాలు చేసింది ఈ ఉద్యోగాల కోసమే కదా.. తీరా చేతి వరకు వచ్చాక మళ్లీ వాయిదాలు వేస్తూ పోతే.. పరీక్షలు నిర్వహించేది ఎప్పుడు? ఫలితాలు వచ్చేదెప్పుడు? అందుకే ఈ విషయంలో ఎక్కడా తగ్గేది లేదంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఏదీ ఏమైనా నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించి తీరుతామంటున్నారు. కొందరి రాజకీయ కుట్రకు నిరుద్యోగులు బలి కావొద్దని సూచిస్తున్నారు.

-3లో



## ఆగస్టు నాటికి రైతులకు రుణమాఫీ

- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు ఒక సారి ఇచ్చాం
- ఇప్పుడు రైతు భరోసాపై అమలుకు విధి విధానాల రూపకల్పన కోసం విస్తృత స్థాయిలో అభిప్రాయ సేకరణ చేస్తున్నాం
- రైతు భరోసా సదస్సులో పాల్గొన్న రైతుల అభిప్రాయం క్రోడీకరిస్తాం
- అందరి సూచనలు నోట్ చేసుకున్నాం.. అన్నింటినీ ప్రభుత్వం పరిశీలిస్తుంది

హనుమకొండ

రైతు భరోసా పథకం అమలుపై తెలంగాణ ప్రభుత్వం శర వేగంగా అడుగులు వేస్తోంది. రైతు భరోసా 5 ఎకరాలకు ఇవ్వాలా, 10 ఎకరాల వరకు ఇవ్వాలనే అంశంపై క్షేత్ర స్థాయిలో రైతులు, రైతు సంఘాల అభిప్రాయాలను ప్రభుత్వం తెలుసుకుంటుంది. ఉమ్మడి జిల్లాల వారీగా రైతు భరోసాపై ప్రభుత్వం వర్క్ షాప్‌లు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రైతులతో సమావేశమై వారిచ్చే సలహాలు, సూచనలను కూడా మంత్రి వర్గ - మిగతా3లో



## నిద్ర నుంచి మేల్కోవాలంటూ మోదీకి చురకలు

- మణిపూర్‌లో జాతుల మధ్య సంఘర్షణకు ముగింపు పలికేలా చర్యలు
- గతేడాది మే 3వ తేదీన ఆ రాష్ట్రంలో హింస మొదలైంది.. అది నేటికి కొనసాగుతుంది
- కేంద్ర ప్రభుత్వంతోపాటు ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి
- మణిపూర్ రాష్ట్రం పూర్తిగా విచ్ఛిన్నమై పోయింది

# ప్రతి రైతుకు రుణమాఫీ

- రూ.2 లక్షల వరకు రుణమాఫీ..
- రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల
- స్వల్పకాలిక పంట రుణాలకు మాత్రమే మాఫీ
- 12-12-2018 తేదీన లేదా ఆ తర్వాత మంజూరైన లేదా రెన్యువల్ అయిన రుణాలకు, 09-12-2023 తేదీ నాటికి బకాయి ఉన్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది.



హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో ఆగస్ట్ 15వ తేదీ లోపు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ క్రమంలో రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలను సోమవారం తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ.2.00 లక్షల వరకు పంట రుణ మాఫీ వర్తిస్తుంది. స్వల్పకాలిక పంట రుణాలకు మాత్రమే మాఫీ వర్తిస్తోందని షరతు విధించారు. రాష్ట్రంలో గల షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ - మిగతా3లో



## నేషనల్ హైవే-44ను 12 లేన్లుగా విస్తరిస్తాం

- రోడ్లు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- కేంద్ర ప్రభుత్వ సాయంతో 44వ హైవే విస్తరకు చర్యలు తీసుకుంటున్నాం
- తుక్కుగూడ నుంచి శ్రీశైలం రహదారి విస్తరణకు చర్యలు
- ఇప్పటికే జాతీయ రహదారుల సంస్థ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు

జడ్చర్ల

జాతీయ రహదారి-44ను 12 లేన్లుగా విస్తరించేందుకు చర్యలు చేపట్టినట్లు రోడ్లు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్, రాజాపూర్, నవాబ్‌పేట, మిడ్జిల్ మండలాల్లో రూ.118 కోట్ల నిధులతో చేపట్టిన డబుల్‌లేన్ బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జడ్చర్లలో మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సాయంతో 44వ హైవే విస్తరకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే జాతీయ రహదారుల సంస్థ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించినట్లు తెలిపారు. తుక్కుగూడ నుంచి శ్రీశైలం రహదారి విస్తరణకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ముఖ్యమంత్రి సహకారం తో ప్రత్యేక నిధులను కేటాయించి జిల్లాలో డబుల్‌లేన్ రోడ్లు - మిగతా3లో

# కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట

- రైతులందరికీ నాణ్యమైన విత్తనాలు
- వ్యవసాయానికి ప్రాధాన్యం
- ఆగస్టు 15 నాటికి పంట రుణాలను మాఫీ చేస్తాం
- రైతులకు సాగుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తాం..
- పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కాంగ్రెస్ హయాంలో నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు
- కాళేశ్వరం ప్రాజెక్టుకు కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసి లక్ష ఎకరాలకు కూడా నీరందించలేకపోయింది
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారాన్ని సృష్టించే బదులు ఆచరణాత్మక పరిష్కారాలు మరియు స్పష్టమైన ఫలితాలపై దృష్టి సారిస్తుంది



హైదరాబాద్

తెలంగాణలో ప్రభుత్వం ఆగస్టు 15 లోగా రైతులకు రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాలను మాఫీ చేస్తుందని పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. తెలంగాణ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా టీపీసీసీ కిషన్ సెల్ ప్రెసిడెంట్ ఎస్ అన్వేష్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులను అప్పుల బాధ నుంచి విముక్తం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే దఫాలో పంట రుణాలను మాఫీ చేసేందుకు కట్టుబడి ఉందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. దీని వల్ల లక్షలాది మంది రైతులు తమ ఆదాయాన్ని ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. పంట రుణాల మాఫీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా ఆగస్టు 15 లోగా పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పారు. రైతుల ఆర్థిక సాధికారత లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని నీటి - మిగతా3లో



## 228 కేజీల బంగారం మాయం?

- కేదార్‌నాథ్ ఆలయంలో 228 కేజీల బంగారం కనిపించడం లేదు: జ్యోతిర్మఠ్ శంకరాచార్య సంచలన వ్యాఖ్యలు
- కేథార్‌నాథ్‌లో బంగారం కుంభకోణం జరిగిందన్న అవిముక్తేశ్వరానంద
- ఢిల్లీలో కేథార్‌నాథ్ ఆలయ నిర్మాణాన్ని నిరసిస్తూ సంచలన వ్యాఖ్యలు
- ఉద్ధవ్ థాక్రేను కలిసిన అనంతరం ఆసక్తికర వ్యాఖ్యలు

# కట్టుదిట్టమైన భద్రత మధ్య లెక్కింపు షురూ

**భువనేశ్వర్ :** దాదాపు 46 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు రత్న భాండాగారం రహస్య గదిని ఒడిశా అధికారులు తెరిచారు. జగన్నాథుడి సేవలకు ఆటంకం లేకుండా భాండాగారాన్ని తెరిచినట్లు సీఎంవో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు మధ్యాహ్నాం 12 గంటలకు ఆలయం లోపలికి వెళ్లారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, ముందస్తుగా నిర్ణయించిన సమయం ప్రకారం 1.28గంటలకు రహస్య గదిని ఓపెన్ చేశారు. సాయంత్రం 5.20 గంటలకు బయటకు వచ్చారు. రత్న భాండాగారంలో ఉన్న ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను త్వరలో లెక్కించనున్నారు. నిధిని తరలించేందుకు చెక్క పెట్టెలను రెడీ చేసినట్లు సీఎంవో స్పష్టం చేసింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆ రత్న భాండాగారంలో ఎన్ని లక్షల కోట్ల నిధి దాగింది.. అసలు అందులో ఏం జరిగింది అనే దాని పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తొలిరోజు రత్న భాండాగారం మూసివేసిన తరువాత ఆలయ ప్రధానాధికారి అరవింద పాఢీ పలు విషయాలు వెల్లడించారు. అరవింద పాఢీ మాట్లాడుతూ.. "తలుపులు తెరిచి లోపలికి వెళ్లి చూశాం. భాండాగారానికి మూడు తాళాలు ఉన్నాయి. జిల్లా అధికారుల వద్ద ఉన్న ఏ తాళం చెవి పని చేయలేదు. దాంతో ముందుగానే నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం, మేజిస్ట్రేట్ సమక్షంలో 3 తాళాలు పగలగొట్టాం. అనంతరం గది లోపలికి వెళ్లి, లోపల బీరువాలో, చెక్క పెట్టెల్లో ఉన్న ఆభరణాలను చెక్ చేశాం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత సమయం తరువాత స్ట్రాంగ్ రూమ్‌ను సీల్ చేశాం. విలువైన వస్తువులను ఒకేసారి తరలించాలి. అందుకు మరింత టైం పడుతుంది. కనుక వాటిని తరలించకూడదని కమిటీ నిర్ణయం తీసుకుంది. బహుద యాత్ర, సున వేష పూజలు నిర్వహించి తర్వాత వాటిని తరలించే తేదీని నిర్ణయిస్తాం" అన్నారు.పూరీ రత్న భాండాగారానికి సంబంధించి మె?త్తం మూడు గదులు ఉంటాయి. మె?దటిది స్వామి వారికి పూజలో భాగంగా ప్రతీ రోజూ తెరుస్తారు. రెండవది ముఖ్యమైన సందర్భాల్లో తెరుస్తారు. ఇక మూడవదే అసలైన రత్న భాండాగారం. దీనిని 46 ఏళ్ల కిందట అంటే 1978లో ఓపెన్ చేశారు. ఇప్పటి వరకు మళ్లీ తెరవలేదు.



తెరచేందుకు మధ్యలో కొన్ని ప్రయత్నాలు జరిగాయి.. కానీ విఫలమయ్యాయి. గదిలో అంతులేని సంపద ఉందని అక్కడి ప్రజల అపార నమ్మకం. ఈ గదికి నాగబంధం కూడా ఉందని చెబుతారు. గతంలో తెరిచినప్పుడు పాము కనిపించిందని అంటారు. ఈ ఖజానాను పాములు రక్షిస్తూ ఉంటాయని అక్కడి ప్రజలు చెబుతుంటారు. అందుకే ఈ రోజు రత్న భాండాగారం తెరిచే సమయంలో పాములు పట్టే వ్యక్తులను కూడా తీసుకెళ్లారు. అంతేకాదు సాంకేతికతను కూడా ఉపయోగించారు. ఎవరికి ఎలాంటి అపాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఏదైనా సమస్య వస్తే.. వెంటనే చికిత్స చేసేందుకు డాక్టర్లను అందుబాటులో ఉంచారు. రత్న భాండాగారం తెరిచే ప్రక్రియ గురించి తెలిసి చాలా మంది గుడికి వచ్చే ప్రయత్నం చేశారు. దీంతో గుడి పరిసర ప్రాంతాల్లో గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. రత్న భాండాగారంలోని అంతులేని సంపదను కమిటీ సభ్యులు పెట్టెల్లో భద్రపరుస్తారు. అందుకే ప్రత్యేకంగా తయారు చేసిన ఆరు పెట్టెలను తీసుకెళ్లారు. ఆ తర్వాత వాటిని డిజిటల్ డాక్యుమెంటేషన్ కూడా చేస్తారు. 1978లో ఖజానాలోని సంపదను లెక్కించేందుకు దాదాపు 70 రోజులు పట్టింది. అయినా కూడా లెక్క తేలలేదని చెబుతుంటారు. పూరీ జగన్నాథుని ఖజానాలో వజ్రాలు, కెంపులు, రత్నాలు, బంగారు ఆభరణాలు, వెండి మొదలైన విలువైన వస్తువులు ఉన్నాయని చెబుతారు. రాజుల కాలంలో కూడా స్వామికి చేయించిన నగలు ఇందులో దాచారని కొందరు అంటారు. స్వామివారి సంపదపై అందరిలో ఆసక్తి నెలకొంది. పూర్వ కాలంలో, ప్రతి మూడు లేదా ఐదు సంవత్సరాలకు, ఈ గది తలుపులు తెరిచి సంపద లెక్కించేవారు. చివరిసారి తెరిచినప్పుడు కొన్నింటిని వదిలేయడంతో లెక్కల్లో కొంత గందరగోళం నెలకొంది. అనంతరం హైకోర్టులో దాఖలైన వ్యాజ్యాన్ని విచారించిన కోర్టు.. ట్రెజరీని తెరిచి సంపదను లెక్కించాలని ఆదేశించింది. దీంతో తాజాగా పూరీ జగన్నాథ్ రత్న భాండాగారం తెరచుకుంది.

## సిగ్నల్ క్రాస్ చేసినా జరిమానా ఉండదు..!!



**బెంగళూర్:** బెంగళూర్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై వాహనదారులు రెడ్ సిగ్నల్ దాటినా ఫైన్ ఉండదని స్పష్టం చేశారు. అందుకు స్పష్టమైన కారణం ఉంది. అంబులెన్స్‌కు దారి ఇచ్చే సమయంలో సిగ్నల్ దాటినా పరిగణలోకి తీసుకోరట. ఒకవేళ మీ వెహికిల్‌కు ఫైన్ పడినా మినహాయింపు ఇస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఉన్న కెమెరాలు ఐదు సెకన్లకు ఒకసారి వాహనదారుల కదలికలు రికార్డ్ చేస్తాయి. అంబులెన్స్‌కు దారి ఇచ్చే సమయంలో సిగ్నల్ జంప్ చేసినట్టు గుర్తిస్తే ఫైన్ పడదు. ఒకవేళ పడినా మినహాయిస్తారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అంబులెన్స్‌లను గుర్తించి రెడ్ లైట్ నుంచి గ్రీన్ లైట్‌లోకి మారేలా జియో ఫెన్సింగ్ చేశామని స్పష్టం చేశారు. సిటీలో 80 అంబులెన్స్‌లకు జీపీఎస్ అమర్చామని ఆరోగ్య శాఖ పేర్కొంది. 100 మీటర్ల దూరంలో అంబులెన్స్ ఉన్నప్పటికీ సిగ్నల్స్ గుర్తిస్తాయని స్పష్టం చేసింది. రహదారులపై ఏఐ సీసీటీవీ కెమెరాలు అమరుస్తామని పోలీసులు చెబుతున్నారు. సేఫ్ సిటీ ప్రాజెక్ట్ మూడో దశలో భాగంగా రైల్వేస్టేషన్లు, ఎయిర్ పోర్ట్, చిన్నస్వామి స్టేడియంలో 150 వాచ్ టవర్లు, 8 హై డెఫినేషన్ ఫేస్ రికగ్నిషన్ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు

# మరాఠాల డిమాండ్లపై మహా సర్కార్ సానుకూలం




మరాఠాలు కోరిన విధంగా వారికి రిజర్వేషన్లు కల్పించేలా చట్టాన్ని తీసుకొచ్చామని మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్ పేర్కొన్నారు. ఈ దిశగా కసరత్తును వేగవంతం చేసి చట్టంపై కసరత్తు చేయడం జరిగిందని అన్నారు. ఈ చట్టంతో పాటు మరాఠాలు మరికొన్ని డిమాండ్లను తెరపైకి తీసుకరాగా, వాటిపైనా ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి చెప్పారు. మరాఠా కోటాపై ఓబీసీ వర్గాల్లో ఎలాంటి భయాలు, అపోహలు ఉండాల్సిన అవసరం లేదని చెప్పారు. ఆయా వర్గాల రిజర్వేషన్లను కుదించకుండానే మరాఠా రిజర్వేషన్ కల్పిస్తామని మంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం ఈ అంశాలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిందని, ఈ భేటీకి విపక్ష ఎంవీఏ ప్రతినిధులు హాజరు కాలేదని అన్నారు. అఖిలపక్ష భేటీకి ఎందుకు హాజరుకాలేదని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. విపక్ష నేతను కలిసేందుకు స్వయంగా పాలక పార్టీ మంత్రులు వెళ్లారని వివరించారు. మరోవైపు మరాఠా రిజర్వేషన్లపై మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే అంతకుముందు కీలక వ్యాఖ్యలు చేశారు. తాము చెప్పిన విధంగా మరాఠాలకు పది శాతం రిజర్వేషన్ కల్పించామని, ఓబీసీ, ఇతర వర్గాల రిజర్వేషన్‌లో కోత విధించకుండానే మరాఠా కోటా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని, మరాఠా కోటాను అడ్డుకోవాలని పలువురు ప్రయత్నిస్తున్నా కోర్టు స్టే ఇవ్వలేదని అన్నారు. మరాఠా రిజర్వేషన్‌లకు అనుగుణంగా నియామకాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. మరాఠ్వాడాలో కుంబి సర్టిఫికెట్లపై జస్టిస్ షిండే కమిటీ కసరత్తు సాగిస్తున్నదని తెలిపారు. నిన్నటి సమావేశంలో ముందుకొచ్చిన అనేక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని, ఆయా అంశాలపై కసరత్తు సాగిస్తుందని సీఎం షిండే వెల్లడించారు.

# 228 కేజీల బంగారం మాయం?

**ముంబై:** ఉత్తరాఖండ్‌లోని శివుని ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన కేదార్‌నాథ్ ఆలయంలో 228 కిలోల బంగారం కనిపించడం లేదంటూ జ్యోతిర్మఠం శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సంచలన వ్యాఖ్యలు చేశారు. కేదార్‌నాథ్‌లో బంగారం కుంభకోణం జరిగిందని, ఆ విషయాన్ని ఎందుకు లేవనెత్తడం లేదని ఆయన ప్రశ్నించారు.

దేశంలోని పన్నెండు జ్యోతిర్లింగ పీఠాల్లో ఒకటైన ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయం నుంచి 228 కిలోల బంగారం మాయమైందని జ్యోతిర్మఠం శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద్ తెలిపారు. కేదార్‌నాథ్‌లో 'గోల్డ్ కుంభకోణం' జరిగిందని మీడియాతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. 'కేదార్‌నాథ్‌లో గోల్డ్ స్కామ్ జరిగింది. ఆ విషయాన్ని ఎందుకు ప్రస్తావించడం లేదు? అక్కడ ఒక కుంభకోణం జరిగిన తర్వాత ఇప్పుడు ఢిల్లీలో కేదార్‌నాథ్ నిర్మిస్తామని అంటున్నారు. అప్పుడు మరో స్కామ్ జరుగుతుంది. కేదార్‌నాథ్ నుంచి 288 కిలోల బంగారం మాయమైంది. దానిపై ఎలాంటి ఎంక్వయిరీ ప్రారంభం కాలేదు. దీనికి కారణం ఏమిటి? ఇప్పుడు ఢిల్లీలో మరో కేదార్‌నాథ్ నిర్మిస్తామంటున్నారు. ఇది జరక్కూడదు" అని అవిముక్తేశ్వరానంద్ సరస్వతి అన్నారు. ఢిల్లీలో మరో కేదార్‌నాథ్ ఆలయ నిర్మాణానికి వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ నిరసనల్లో కేదార్‌నాథ్ ఆలయ అర్చకులు పాల్గొన్నారు. ఢిల్లీలో జూలై 10న జరిగిన ఆలయ శంకుస్థాపన కార్యక్రమానికి ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి హాజరయ్యారు. "అక్కడ స్కామ్ చేసి ఢిల్లీలో కేదార్‌నాథ్‌ను నిర్మిస్తారా? అలా చేస్తే మరో కుంభకోణం జరుగుతుంది. కేదార్‌నాథ్ ఆలయంలో 228 కేజీల పసిడి లేదు. దర్యాప్తు కూడా మొదలుపెట్టలేదు. దీనికి బాధ్యులు ఎవరు? ఇప్పుడు ఢిల్లీలో కేదార్‌నాథ్ ఆలయాన్ని నిర్మిస్తామని చెబుతున్నారు. అలా



జరగడానికి వీల్లేదు" అని అవిముక్తేశ్వరానంద అన్నారు. కాగా దేశ రాజధాని ఢిల్లీలో కేథార్‌నాథ్ ఆలయం నిర్మాణానికి జులై 10న శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి కూడా పాల్గొన్నారు. అయితే ఢిల్లీలో ఆలయ నిర్మాణం పట్ల నిరసన తెలుపుతూ అవిముక్తేశ్వరానంద ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో కేదార్‌నాథ్ ఆలయం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పలువురు పూజారులు నిరసనకు దిగారు.

### ఉద్ధవ్ ఠాక్రే మళ్లీ మహారాష్ట్ర సీఎం అవుతారు

శివసేన (యుబీటీ) చీఫ్ ఉద్ధవ్ థాక్రేతో అవిముక్తేశ్వరానంద సోమవారం సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్ధవ్ ఠాక్రే వంచనకు గురైన వ్యక్తి అని, ఆయన మళ్లీ తప్పకుండా మహారాష్ట్ర ముఖ్యమంత్రి అవుతానని ఆశాభావం వ్యక్తం చేశారు. తామంతా సనాతన ధర్మాన్ని అనుసరించేవాళ్లమని, పాపం, పుణ్యాలకు నిర్వచనం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ద్రోహం అతి పెద్ద పాపమని, ఉద్ధవ్ ఠాక్రే మోసపోయారని, ఆయనకు జరిగిన ద్రోహానికి తామంతా బాధపడ్డామని తెలిపారు. ఉద్ధవ్ ఠాక్రే మళ్లీ మహారాష్ట్ర సీఎం అయ్యే వరకు తమ బాధలు తీరబోవని అన్నారు. మోసం చేసే వ్యక్తి హిందువు కాలేడని అవిముక్తేశ్వరానంద వ్యాఖ్యానించారు.

## నిద్ర నుంచి మేల్కోవాలంటూ మోదీకి చురకలు



**న్యూఢిల్లీ :** మణిపూర్‌లోని జిరిబమ్‌లో భద్రత దళాల కాన్వాయిపై జరిగిన దాడిని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఖండించారు. మణిపూర్‌లో జాతుల మధ్య సంఘర్షణకు ముగింపు పలికేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వంతోపాటు ప్రధాని నరేంద్ర మోదీకి ఆమె విజ్ఞప్తి చేశారు. గతేడాది మే 3వ తేదీన ఆ రాష్ట్రంలో హింస మొదలైందన్నారు. అది నేటికి కొనసాగుతుందని ప్రియాంక గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ రాష్ట్రం పూర్తిగా విచ్ఛిన్నమై పోయిందని ఈ సందర్భంగా ప్రియాంక ఆందోళన చెందారు. ఇకనైనా నిద్ర నుంచి మేల్కోవాలంటూ.. ప్రధాని మోదీతోపాటు కేంద్ర ప్రభుత్వానికి ఆమె చురకలంటించారు. ఈ ఘటన చోటు చేసుకోవడం విచారకరమన్నారు. సీఆర్పీఎఫ్ జవాను మృతికి సంతాపం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ వేదికగా ప్రియాంక గాంధీ స్పందించారు. ఆదివారం కాన్వాయిపై జరిగిన దాడిలో ఓ సీఆర్పీఎఫ్ జవాన్ మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై మణిపూర్ సీఎం బైరన్ సింగ్ ఖండిచారు. ఇది కూకీ తీవ్రవాదుల పనే అని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు రాజస్థాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ స్పందించారు. ఈ ఘటనలో జవాన్ మృతి చెందడం పట్ల ఆయన సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మణిపూర్‌లో జిరిబమ్ జిల్లాలోని మాంగ్‌బంగ్ ప్రాంతంలో ఆదివారం ఉదయం భద్రతా బలగాలతో వెళ్తున్న కాన్వాయ్‌పై దుండగులు తుపాకీలతో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒక సీఆర్పీఎఫ్ జవాన్ మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన జవాన్ బిహార్‌కు చెందిన అజయ్ కుమార్ ఝాగా అధికారులు గుర్తించారు. తలలో బుల్లెట్ దిగడంతోనే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

## డిగ్రీల వల్ల ఉపయోగం లేదు.. పంక్చర్ షాప్ తెరవండి: బీజేపీ ఎమ్మెల్యే



**భోపాల్:** ఒక బీజేపీ ఎమ్మెల్యే విద్యార్థులకు వింత సలహా ఇచ్చారు. డిగ్రీల వల్ల ఏ ఉపయోగం లేదన్నారు. ఈ నేపథ్యంలో పంక్చర్ షాప్ తెరుచుకోవాలని స్టూడెంట్స్‌కు సూచించారు. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. గుణ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే పన్నాలాల్ షాక్యా ఆదివారం 'పీఎం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బీజేపీ ఎమ్మెల్యే పన్నాలాల్ షాక్యా మాట్లాడారు. డిగ్రీలు పొందడం వల్ల ఏమీ లాభం లేదని తెలిపారు. విద్యార్థులు జీవనోపాధి పొందేందుకు మోటార్‌సైకిల్ పంక్చర్ రిపేర్ దుకాణాన్ని తెరవాలని సూచించారు. 'మేం ఈరోజు పీఎం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభిస్తున్నాం. ఈ కాలేజీ డిగ్రీలతో ఏమీ జరుగదు. ఒక వాక్యాన్ని గుర్తుంచుకోవాలని నేను ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేస్తున్నా. డిగ్రీలకు బదులుగా, జీవనోపాధి కోసం కనీసం మోటార్‌సైకిల్ పంక్చర్ రిపేర్ షాప్ తెరవండి' అని అన్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి.

## రాజ్యసభలో తగ్గిన బీజేపీ సంఖ్యాబలం..



రాష్ట్రపతి నామినేట్ చేసిన నలుగురు రాజ్యసభ ఎంపీలు రాకేశ్ సిన్హా, రామ్ షకల్, సోనాల్ మాన్‌సింగ్, మహేశ్ జెఠ్మలానీల పదవీకాలం శనివారంతో పూర్తయింది. దీంతో ఎగువ సభలో బీజేపీ సంఖ్యా బలం 86కి తగ్గింది. ఫలితంగా ఎన్డీయే మెజారిటీ కూడా తగ్గిపోయింది. రాజ్యసభలో మొత్తం 245 స్థానాలు ఉండగా 20 ఖాళీలు ఉన్నాయి. దీంతో సభలో ప్రస్తుతం మేజిక్ ఫిగర్ 113 కంటే తక్కువగా ఎన్డీయే సంఖ్యాబలం 101గా ఉంది. మెజారిటీకి ఎన్డీయే కూటమికి ఇంకా 12 మంది సభ్యులు అవసరం అవుతారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి వద్ద మొత్తం 87 మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. పార్టీల వారీగా చూస్తే కాంగ్రెస్ పార్టీకి 26 మంది, తృణమూల్ కాంగ్రెస్‌కు 13 మంది, ఆమ్ ఆద్మీ పార్టీ, డీఎంకే పార్టీలకు చెరో 10 మంది చొప్పున రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. ఇక ఎన్డీయే, ఇండియా కూటములలో లేని బీఆర్ఎస్ పార్టీకి నలుగురు ఎంపీలు ఉన్నారు. పలువురు స్వతంత్ర రాజ్యసభ ఎంపీలు కూడా ఉన్నారు.

### బిల్లుల ఆమోదానికి ఇతర పార్టీలే దిక్కు!

ఏదైనా బిల్లు చట్టంగా మారాలంటే లోక్‌సభతో పాటు రాజ్యసభలోనూ ఆమోదం పొందాల్సి ఉంటుంది. అయితే బిల్లుల ఆమోదం పొందేందుకు ఎన్డీయే కూటమికి రాజ్యసభలో తగినంత సంఖ్యాబలం లేదు. దీంతో ఇతర పార్టీలపై ఎన్డీయే కూటమి ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. గత దఫా ప్రభుత్వం మాదిరిగా ముమ్మందు కూడా బిల్లుల విషయంలో అన్నాడీఎంకే, వైఎస్సార్‌సీపీ పార్టీల మద్దతను ఎన్డీయే పొందాల్సి ఉంటుందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

### వైసీపీ, అన్నాడీఎంకే మద్దతు కీలకం?

మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పెద్దగా లోక్‌సభ స్థానాలను గెలవలేకపోయినప్పటికీ ఆ పార్టీ వద్ద 11 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ-జనసేనతో కలిసి బీజేపీ పోటీ చేసినప్పటికీ.. రాజ్యసభలో బిల్లుల ఆమోదం కోసం వైసీపీని ఆశ్రయించాల్సి రావొచ్చని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇక తమిళనాడు పార్టీ అయిన అన్నాడీఎంకే వద్ద నలుగురు రాజ్యసభ సభ్యులు ఉన్నారు. ఇక ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ సారధ్యంలోని బీజేడీ వద్ద 9 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నాయి. అయితే ఈసారి ఆ పార్టీ బీజేపీకి మద్దతు ఇస్తుందా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలోనే ఆ పార్టీ ఓటమి పాలైంది. కాబట్టి మద్దతు ఇవ్వడం అనుమానమేనని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇదిలావుంచితే రాజ్యసభలో ఖాళీగా ఉన్న 20 స్థానాలకు ఈ ఏడాదే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇందులో 9 సీట్ల వరకు ఎన్డీయే కూటమి పార్టీలు గెలిచేందుకు అవకాశాలు ఉన్నాయి.

# ఆగస్టు నాటికి రైతులకు రుణమాఫీ

-మొదటిపేజీ తరువాయి

ఉప సంఘం ఆచరణలోకి తీసుకుంటుంది. ఈ రోజు(సోమవారం) వరంగల్లోని కలెక్టర్ కార్యాలయంలో రైతు భరోసాపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. రైతు భరోసా పథకానికి సంబంధించి విధి, విధానాలపై మంత్రులు ఈ సమావేశంలో చర్చించారు. ఈ కమిటీ తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పరిస్థితులు, సాగు విస్తీర్ణం, రైతాంగ స్థితిగతులపై అధ్యయనం చేస్తుంది. అయితే రైతులతో చర్చించిన తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలు కీలక విషయాలు మీడియాకి వెల్లడించారు. రైతు భరోసా సదస్సులో పాల్గొన్న రైతుల అభిప్రాయం క్రోడీకరిస్తామని తెలిపారు. అందరి సూచనలు నోట్ చేసుకున్నామన్నారు. అన్నింటినీ ప్రభుత్వం పరిశీలిస్తుందని అన్నారు. అందరి అభిప్రాయానికి తగినట్టుగా సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. వరంగల్



నుంచే ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ రైతు భరోసా హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నా మని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల విద్యుత్ లాంటి పథకాలు అమలు చేశామని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు ఒక సారి ఇచ్చామని.. ఇప్పుడు రైతు భరోసాపై అమలుకు విధి విధానాల రూపకల్పన కోసం విస్తృత స్థాయిలో అభిప్రాయ సేకరణ చేస్తున్నామని తెలిపారు. అసెంబ్లీలో ఒక రోజంతా చర్చిస్తామని అన్నారు. రైతులకు అందించే భరోసా సొమ్ము ప్రజలు టాక్స్ రూపంలో చెల్లించినవేనని అన్నారు. అందుకే ప్రతి పైసా సక్రమంగా వినియోగం కోసం అన్నివర్గాల నుంచి సూచనలు, అభిప్రాయాలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులకు బీమా సౌకర్యం కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, ఇన్సురెన్స్ కంపెనీలతోను చర్చలు జరుపుతున్నారని వివరించారు. తమ ప్రభుత్వంలో విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా చేశామని రైతులు స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకోవాలని సూచించారు. రైతుల అభిప్రాయాలు క్రోడీకరించి శాసన సభలో చర్చిస్తామని అన్నారు. చర్చించిన తర్వాతే రైతు భరోసా అమలు చేస్తామని అన్నారు. వచ్చే ప్రతీ చిన్న ఆదాయాన్ని పోగుచేసి ప్రజలకే పంచుతామని చెప్పారు. ప్రజల అభిప్రాయమే గవర్నమెంట్ జీవోగా వస్తుందని చెప్పారు. త్వరలోనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకోబోతున్నామని అన్నారు. రైతు భరోసాతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ లాంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు..

# ప్రతి రైతుకు రుణమాఫీ

-మొదటిపేజీ తరువాయి

బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, బ్రాంచ్‌ల నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది. 12-12-2018 తేదీన లేదా ఆ తర్వాత మంజూరైన లేదా రెన్యువల్ అయిన రుణాలకు, 09-12-2023 తేదీ నాటికి బకాయి ఉన్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది. 09-12-2023 వరకు బకాయి ఉన్న అసలు, వడ్డీ మొత్తం రుణ మాఫీ పథకానికి అర్హత కలిగి ఉంటుంది. రైతు కుటుంబం నిర్ణయించడానికి పౌరసరఫరాల శాఖ ఆహార భద్రత కార్డు (పీడీఎస్) డేటాబేస్ ప్రామాణికంగా ఉంటుంది. ఆ కుటుంబంలో ఇంటి యజమాని, జీవిత భాగస్వామి, పిల్లలను పరిగణనలోకి తీసుకుంటారు.

### డీఓఏ ఆధ్వర్యంలో

వ్యవసాయశాఖ కమిషనర్, సంచాలకులు (డీఓఏ) పంట రుణమాఫీ 2024 పథకాన్ని అమలు చేస్తారు. హైదరాబాద్‌లో గల నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ఈ పథకానికి భాగస్వామిగా ఉంటుంది. వ్యవసాయశాఖ సంచాలకులు, ఎస్బీఐ కలిసి ఐటి పోర్టల్ నిర్వహిస్తారు. ఆ పోర్టల్‌లో ప్రతి రైతు కుటుంబానికి సంబంధించిన లోన్ అకౌంట్ డేటా సేకరణ, డేటా వాలిడేషన్, అర్హత మొత్తాన్ని నిర్ణయించడానికి సౌకర్యం ఉంటుంది. ఐటి పోర్టల్ ఆర్థికశాఖ నిర్వహించే ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌కి బిల్లులు సమర్పించడం, పథకానికి సంబంధించిన భాగస్వాములతో సమాచారం పంచుకోవడం, రైతులు ఇ



చ్చేఫిర్యాదులపరిష్కారానికి ప్రత్యేకమైన మాడ్యూల్స్ ఉంటాయి.

### నోడల్ అధికారి

పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒక అధికారిని బ్యాంకు నోడల్ అధికారిగా (బీఎస్) నియమిస్తారు. బ్యాంకు నోడల్ అధికారి బ్యాంకులకు వ్యవసాయశాఖ సంచాలకులు, ఎన్ఐసీ మధ్య సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. బ్యాంక్ నోడల్ అధికారులు తమ సంబంధిత బ్యాంక్ యొక్క పంట రుణాల డేటాను డిజిటల్ సంతకం చేయాల్సి ఉంటుంది.

# ఉద్యోగాలపై కాంగ్రెస్ రూట్‌మ్యాప్

**హైదరాబాద్ :** తెలంగాణ రాకముందు ఏళ్లుగా పోరాటం.. తెలంగాణ వచ్చాక కూడా పదేళ్లుగా పోరాటం.. దేనికి ఉద్యోగాల కోసం. ఉన్న ఇంటిని విడిచి.. కోచింగ్ సెంటర్లకు వేలల్లో ఫీజులు కట్టి.. సగం తిని.. తినకా చెట్ల కింద కూర్చొని చదివేది ఎందుకు.. ? నోటిఫికేషన్లు పడతాయని.. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో నోటిఫికేషన్లు వచ్చి ఉద్యోగాలు సాధించే సమయం వచ్చే సరికి మళ్లీ అవే ఆందోళనలు. ఈసారి నోటిఫికేషన్లను వాయిదా వేయాలని.. ఇదేక్కడి లాజిక్.. ? మనం ఇన్నేళ్లుగా పోరాటాలు చేసింది ఈ ఉద్యోగాల కోసమే కదా.. తీరా చేతి వరకు వచ్చాక మళ్లీ వాయిదాలు వేస్తూ పోతే.. పరీక్షలు నిర్వహించేది ఎప్పుడు? ఫలితాలు వచ్చేదెప్పుడు? అందుకే ఈ విషయంలో ఎక్కడా తగ్గేది లేదంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఏదీ ఏమైనా నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించి తీరుతామంటున్నారు. కొందరి రాజకీయ కుట్రకు నిరుద్యోగులు బలి కావొద్దని సూచిస్తున్నారు.పుస్తకాల్లో ఉన్న చదువులు.. బయట మార్కెట్‌లో సమాజానికి అసలేమైనా సంబంధం ఉందా? ఈ చదువులు చదివి బయటికి వచ్చిన వారికి ఉద్యోగాలు వస్తున్నాయా? ప్రతి ఏటా లక్షలాది మంది చేతుల్లో సర్టిఫికేట్లు ఉంటున్నాయి తప్పా.. వారిలో పనితనం ఉంటుందా? ఇవే ప్రశ్నలను సూటిగా వేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి.. క్వాలిటీ ఎడ్యుకేషన్‌పై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు.కాలేజీలంటే ఏంటి.. ? ఉన్నత విద్యతో పాటు.. ప్రపంచానికి తగ్గట్టుగా అవసరమైన స్కిల్స్‌ను తయారు చేసే సంస్థలు.. విద్యా సంస్థలు.. కానీ బాధించాల్సిన విషయం ఏంటంటే.. ఇప్పుడు ఇంజనీరింగ్ కాలేజీలు అన్ని కూడా నిరుద్యోగ కర్మాగారాలుగా మారాయి. ఇదే విషయాన్ని చెప్పారు రేవంత్ రెడ్డి. ఇంజనీరింగ్ కాలేజీలన్ని నిరుద్యోగులను తయారు చేసే కర్మాగారాలుగా మారొద్దన్నారు ఆయన. అంతేకాదు..




ప్రపంచంలో అద్భుతాలు సృష్టించింది ఇంజనీర్లే అని. సివిల్ అండ్ ఐటీపై ఇంజనీరింగ్ కాలేజేస్ ఫోకస్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఇంజనీరింగ్ అంటే కేవలం కంప్యూటర్ సైన్స్ మాత్రమే కాదు.. సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులను కూడా కాలేజీలు ప్రోత్సహించాల్సిదే. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా టాటా భాగస్వామ్యంతో 2వేల 400 కోట్లతో ప్రభుత్వం ఐటీఐల రూపురేఖలను మారుస్తుంది. నిజానికి కాలేజీలకు ఓ విజన్ ఉండాలి. ప్రస్తుతం ఫార్మా, ఐటీ తరువాత నెక్ట్స్ ప్రపంచాన్ని ఏలబోయేది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. కాబట్టి కాలేజీలన్ని కూడా ఏఐపై ఫోకస్ చేయాలని సూచించారు రేవంత్.. ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని.. అలా చేసేందుకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని కాలేజీలకు సూచించారు రేవంత్.లెటెస్ట్‌గా జరుగుతున్న నిరుద్యోగ సమస్యలపై కూడా రేవంత్ రియాక్ట్ అయ్యారు. పదేళ్ల ఉద్యోగాల భర్తీ చేయాలని నిరుద్యోగ యువత కోట్లాడిన యువత. ఇప్పుడు పరీక్షల వాయిదా కోసం కొన్ని రాజకీయ శక్తులు, కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఆమరణ దీక్షలు చేయడంపై తీవ్రంగా స్పందించారు. నిరుద్యోగులను తప్పుదోవ పట్టించేందుకు ఎవరెన్ని కుట్రలు, ప్రయత్నాలు చేసినా వారి మంచి కోసం తాము ఎప్పుడూ పోరాడుతూనే ఉంటామని త్వరలోనే జాబ్ క్యాలెండర్ ను తీసుకురాబోతున్నామని యూపీఎస్సీ తరహాలో ప్రతీ ఏటా క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామని మరోసారి క్లారిటీ ఇచ్చారు.మొత్తంగా చూస్తే.. ఉద్యోగాలు కల్పించే విషయంలో తాము ఎక్కడా వెనక్కి తగ్గడం లేదని రేవంత్ క్లారిటీ ఇచ్చారు. అదేవిధంగా.. ఉద్యోగాలు సాధించాలంటే.. సరైన స్కిల్స్ నేర్చుకోవాలని ఆ స్కిల్స్‌ను నేర్పే కాలేజీలు పటిష్టంగా ఉండాలని చెబుతున్నారు. నిరుద్యోగాన్ని రూపుమాపాలంటే.. మొదట ప్రపంచ అవసరాలకు తగ్గట్టుగా సిలబస్‌ను మార్చాలి. అలా మార్చితేనే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుందనేది సీఎం రేవంత్ ఆలోచన.

# డ్రగ్స్ అరికట్టేందుకు ప్లాన్

**హైదరాబాద్ :** రాష్ట్రంలో డ్రగ్స్ ను అరికట్టేందుకు ప్రభుత్వం సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తోంది. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్లల్లో ప్రహరీ క్లబ్ లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పాఠశాలలు, పిల్లల సంరక్షణ కేంద్రాల పరిసరాల్లో మాదకద్రవ్యాల విక్రయాలు జరగకుండా, విద్యార్థులు వాటి బారిన పడకుండా ప్రహరీ క్లబ్ లు నిఘా పెట్టనున్నాయి. ఇందుకు సంబంధించి విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం ఆదేశాలు జారీ చేశారు. పిల్లలను మాదకద్రవ్యాల దుర్వినియోగం నుంచి దూరం చేయడానికి ప్రహరీ క్లబ్ లను ఏర్పాటు చేయనున్నారు.పాఠశాలల్లో ప్రహరీ క్లబ్ అధ్యక్షుడిగా హెడ్ మాస్టర్ లేదా ప్రిన్సిపాల్ ఉండనున్నాడు. వైస్ ప్రెసిడెంట్ గా సీనియర్ టీచర్ లేదా ఫ్రెండ్లీ టీచర్ ఉంటారు. 6 నుంచి పదో తరగతి వరకు ప్రతి క్లాసులో ఇద్దరు విద్యార్థులు, స్థానికంగా ఉండే పోలీస్ స్టేషన్ నుంచి ఒక పోలీస్.. పేరెంట్స్ నుంచి ఒకరు ప్రహరీ క్లబ్ లో సభ్యులుగా ఉండనున్నారు. విద్య సంస్థల్లోకి మత్తు పదార్థాలు చేరకుండా, విద్యార్థులు వాటి ఊబిలో చిక్కుకోకుండా అవసరమైన ప్రణాళికలను ప్రహరీ క్లబ్ లు రూపొందిస్తాయి.ప్రస్తుతానికి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఈ ప్రహరీ క్లబ్ లను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన పూర్తి గైడ్ లైన్స్ ను ప్రభుత్వం త్వరలోనే విడుదల చేయనున్నది.

## నేషనల్ హైవే-44ను 12 లేన్లుగా విస్తరిస్తాం

-మొదటిపేజీ తరువాయి

నిర్మిస్తున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో డబుల్‌లేన్ రోడ్లు, బైపాస్ రోడ్ల అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. జడ్చర్ల నుంచి భూత్పూరు వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఓవైపు ఆరు గ్యారెంటీలు అమలు చేయడంతోపాటు మరోవైపు అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు వివరించారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు.

**ప్రాజెక్టుల పేరిట కేసీఆర్ భారీ స్కాం.. కోమటిరెడ్డి సంచలన ఆరోపణలు**

ప్రాజెక్టుల పేరిట మాజీ సీఎం కేసీఆర్ వేల కోట్ల రూపాయల స్కాం కు తెరలేపారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఆయనకు రాజకీయ బిక్ష పెట్టిన పాలమూరుకు తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ భారీ అప్పుల ఊబిలో నెట్టివేశారని ఫైర్ అయ్యారు. ఈరోజు ప్రభుత్వ ఉద్యోగులకు తమ ప్రభుత్వంలో మొదటి తారీఖున జీతాలు వేస్తున్నామని గుర్తుచేశారు. మహబుబ్ నగర్ జిల్లా ప్రజలను మోసం చేసి పక్క రాష్ట్రాలకు పంపి వారిని లేబర్‌గా మార్చారని మండిపడ్డారు. కేసీఆర్ మహబూబ్‌నగర్ జిల్లాలో కట్టిన ఒక్క ప్రాజెక్టు పాలమూరుకు ఉపయోగ పడలేదని మండిపడ్డారు. మహబుబ్ నగర్ జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... తాము అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని తెలిపారు. 0 బిల్లులతో ప్రతి పేదవాడికి కరెంట్ బిల్లులు లేకుండా చేస్తున్నామని వివరించారు. భద్రాచలం రాముల వారి సన్నిధి నుంచే ప్రతి పేదవాడికి రూ. 5లక్షలతో డబుల్ బెడ్ ఇల్లు కేటాయించే కార్యక్రమాన్ని చేపడుతామని ప్రకటించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట




-మొదటిపేజీ తరువాయి

పారుదల శాఖ మంత్రి హైలైట్ చేశారు. 2023 డిసెంబర్‌లో అధికారం చేపట్టిన వెంటనే రైతు భరోసా పథకాన్ని ప్రారంభించామని, ఇది రైతులందరికీ ఏడాదికి ఎకరాకు రూ.15,000 పెట్టుబడి మద్దతునిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆయకట్టును పెంచేందుకు కనీస పెట్టుబడితో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల రీడిజైనింగ్, పేరుమార్చి ప్రజాధనాన్ని వృథా చేశారని, వాటి వల్ల రైతులకు ఎలాంటి మేలు జరగలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసి లక్ష ఎకరాలకు కూడా నీరందించలేకపోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారాన్ని సృష్టించే బదులు ఆచరణాత్మక పరిష్కారాలు మరియు స్పష్టమైన ఫలితాలపై దృష్టి సారిస్తుందని ఆయన ఉద్ఘాటించారు. అన్వేష్‌రెడ్డి నియామకంపై అభినందనలు తెలిపిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ పటిష్టమైన సంస్థగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో నకిలీ విత్తనాల వ్యాప్తిని నియంత్రించలేదని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందించడంతో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న రైతులందరికీ నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అంతేకాకుండా, రైతుల నుండి అన్ని ఉత్పత్తులను కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి కొనుగోలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని, ఎంఎస్‌పి కంటే తక్కువ వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా మధ్యవర్తులు మరియు వ్యాపారులను హెచ్చరిస్తున్నట్లు ఆయన చెప్పారు. తెలంగాణ జనాభాలో దాదాపు 70% మంది వ్యవసాయం మరియు అనుబంధ కార్యకలాపాలపై ఆధారపడి ఉన్నారని, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యవసాయం ప్రాధాన్యతనిస్తుందని అన్నారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకుందని, వ్యవసాయ కార్యకలాపాలను యాంత్రీకరించడంతో పాటు, వ్యవసాయ దిగుబడిని మెరుగుపరచడానికి మరియు పెంచడానికి సాంకేతికత మరియు కృత్రిమ మేధస్సును ఉపయోగించాలని మంత్రి సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు అందజేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పంట రుణాల మాఫీ సహా పలు కీలక అంశాలపై రానున్న అసెంబ్లీ సమావేశంలో చర్చిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

## 5650 మందికి డబుల్ పెన్షన్లు

**ఖమ్మం :** రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5650 మంది అటు ఉద్యోగ పెన్షన్లతో పాటు.. ఆసరా పెన్షన్లు అందుకున్నట్లు సెర్ప్ నివేదికలో వెల్లడైంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడినట్లు తేలింది.గత ఎన్నికల్లో అధికార మార్పిడితో గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. తాజాగా రాష్ట్రంలో 5650 మందికి డబుల్ పెన్షన్లు అందుతున్నట్లు సెర్ప్ తన నివేదికలో వెల్లడించడం గమనార్హం.ప్రభుత్వ సర్వీసులో పని చేసి రిటైర్మెంట్ అయిన తర్వాత పొందుతున్న పెన్షన్ తో పాటు ఆసరా పెన్షన్ సైతం పొందుతున్న విడ్డూరం చోటు చేసుకోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. రాష్ట్రంలో 5650 మందికి డబుల్ పెన్షన్లు అందుతుండగా ఇందులో 3826 మంది చనిపోయారు. ఇక 1826 మంది ఇప్పటికీ రెండు పెన్షన్లను పొందుతున్నట్లు సెర్ప్ తన నివేదికలో వెల్లడించింది. దీంతో మేల్కొన్న ప్రభుత్వం జూన్ నెల నుంచి ఈ పెన్షన్లను నిలిపివేసింది.ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 427 మందికి అక్రమ పెన్షన్లు అందుతున్నట్లు వెల్లడయ్యింది. వీరందరికీ ప్రభుత్వం ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ లో ఓ వృద్ధురాలికి ఒక లక్షా, 72 వేలు తిరిగి ఇవ్వాల్సిందిగా నోటీసు అందింది. అలాగే ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 139 మందికి సర్కారు నుంచి నోటీసులు అందాయి.నోటీస్ అందిన వారం రోజులలోపు స్పందించి పెన్షన్ రూపంలో పొందిన సొమ్మును తిరిగి చెల్లించకపోతే కేంద్ర, రాష్ట్రాల నుంచి పొందుతున్న సర్వీస్ పెన్షన్ నిలిపివేస్తామని హెచ్చరించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ 200 మందికి నోటీసులు అందాయి.రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ల పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ఆగస్టు నుంచి ఆసరా పెన్షన్లను 4వేలు, 6 వేలకు పెంచాలని నిర్ణయించింది. ఈ క్రమంలో అక్రమంగా పొందుతున్న పెన్షన్లపై దృష్టి పెట్టింది. ఇలా అక్రమంగా పెన్షన్లు జారీ చేయడంలో కీలక పాత్ర పోషించిన అధికారులపై సైతం చర్యలు తీసుకునే అవకాశం లేకపోలేదు కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడినట్టు తెలంగాణలో కాంగ్రెస్ పాలన ఉందని కేటీఆర్ సెటైర్స్ పేల్చారు. తాము వస్తే కొత్తగా అనేక పథకాలు ఇస్తామని, ఇదివరకే ఉన్న సంక్షేమ పథకాలకు వచ్చే డబ్బును పెంచుతామని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం లబ్దిదారుల నుండి సొమ్ముని వెనక్కి తీసుకుంటుందని విమర్శించారు. రాష్ట్రంలో లబ్దిదారుల నుండి సొమ్ముని వెనక్కు రాబట్టే వింత చేష్టలు కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుపెట్టిందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఏవో టెక్నికల్ రీజన్స్ చెబుతూ వేలాది మంది ఆసరా పెన్షన్ లబ్దిదారుల నుండి డబ్బును ప్రభుత్వానికి వెనక్కు పంపాలని నోటీసులు ఇస్తోందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన 80 ఏళ్ల ముసలమ్మ దాసరి మల్లమ్మకు ఆసరా పెన్షన్ కింద వచ్చిన ఒక లక్షా రూ.72 వేలు వెనక్కు కట్టాలని నోటీసులు ఇచ్చారు.

# అధిక పని గంటలతో పరేషానే.!



అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలతో పోటీ పడాలంటే యువకులు వారానికి 70 గంటలు పని చేయాలని ఇటీవల ఓలా సీఈఓ భవిష్ అగర్వాల్ వ్యాఖ్యానించారు. గతంలో ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కూడా దాదాపుగా ఇలాంటి వ్యాఖ్యలే చేయగా.. ఆయనను భవిష్ అగర్వాల్ సమర్థించారు. అయితే ఇక్కడ కేవలం అభివృద్ధి, వ్యాపార ప్రయోజనాలు మాత్రమే కనిపిస్తున్నాయని, వాటి వల్ల కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్యాలపై పడే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. 70 గంటలు పని చేస్తే అనేక తీవ్రమైన వ్యాధులు వస్తాయని, అకాల మరణం ముప్పు కూడా పెరుగుతుందని న్యూరాలజిస్టులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే 55 గంటల కంటే ఎక్కువ పని చేయడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి ఎనిమిది లక్షల మంది మృతి చెందుతున్నట్లు డబ్ల్యూహెచ్ఓ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో మూడొంతులమంది మధ్య వయస్కులు లేదా అంతకన్నా పెద్దవారేనని తేలింది.

**ఆసియాలో ఎక్కువ.. ఐరోపాలో తక్కువ..**

అధిక గంటలు పని విధానం ఆసియాలో ఎక్కువగా.. ఐరోపాలో తక్కువగా ఉన్నది. ప్రపంచంలో తొమ్మిది శాతం కంటే ఎక్కువగా పిల్లలు, పెద్దలు సాధారణం కంటే అధిక గంటలు పని చేస్తున్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రకారం.. వారానికి 47.7 గంటలు పని చేసే కార్మికులు ఉన్న దేశాల జాబితాలో భారత్ ఏడో స్థానంలో ఉన్నది. మరోవైపు కరోనా తర్వాత వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్ స్టార్ట్ కాగా, ఇంటి నుంచి పని చేసే వారు సగటున 3.6 గంటలు ఎక్కువ సేపు విధి నిర్వహణలో ఉంటున్నారని తేలింది. ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో%-%ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) గణాంకాల ప్రకారం అధిక పనిగంటల విషయంలో మొత్తం 187 దేశాల్లో భారతదేశానిది 136వ ర్యాంకు. భారతీయ శ్రామికులు సగటున ఏటా 1660 గంటలు పనిచేస్తూ, 2,281 డాలర్ల మేర తలసరి జీడీపీ అందిస్తున్నారు.

**వ్యాపార, పారిశ్రామిక వేత్తల అభిప్రాయమదే..**

ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి, ఓలా భవిష్ అగర్వాల్ లే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వ్యాపార, పారిశ్రామిక వేత్తలు అధిక పని గంటలకే ఓటు వేస్తున్నారు. 'బాగా తినండి. దృఢంగా ఉండి. అలాగే, రోజుకు 18 గంటలు పనిచేయండి' అంటూ బాంబే షేవింగ్ కంపెనీ సీఈఓ శంతను దేశ్ పాండే గతంలో లింక్డిన్‌లో పోస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. చైనాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, అలీబాబా వ్యవస్థాపకుడు జాక్‌మా 996 అనే రూల్‌ను ప్రతిపాదించారు. దాని ప్రకారం.. ఉద్యోగులు వారంలో ఆరు రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పనిచేయాలని సూచించారు. ట్విట్టర్ ను కొనుగోలు చేసిన సమయంలో ఎలాన్ మస్క్ కూడా సంస్థ మనుగడ కోసం వారానికి వంద గంటలు పని చేయాలని ఉద్యోగులకు మెయిల్ చేశారనే చర్చ జరిగింది.

**తీవ్రమైన అనారోగ్య సమస్యలు**

ఆరు రోజుల పని దినాల ఉద్యోగాల్లో వారానికి 70 గంటలు పనిచేస్తే రోజుకు 14 గంటలు పని చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం మన ప్రభుత్వ కార్యాలయాల్లో 8 గంటల పనితో 6 రోజుల పని నిర్వహణతో వారానికి 48 గంటలు పని చేస్తున్నారు. అదే ప్రైవేట్ కార్యాలయాల్లో రోజుకు పది గంటల పనితో వారానికి 60 గంటలు పని చేయిస్తున్నారనే చర్చ ఉన్నది. వారానికి 55 లేదా అంతకంటే ఎక్కువ గంటలు పని చేయడం వల్ల హార్ట్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం 35 శాతం పెరుగుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. 35-40 గంటలు పని చేసే వారితో పోలిస్తే, హార్ట్ డిసీజ్‌తో మరణించే ప్రమాదం 17 శాతం ఎక్కువని చెబుతున్నారు. సుదీర్ఘ పని గంటలు అధిక బరువు, ప్రీడయాబెటిస్, టైప్ 2 మధుమేహం వంటి ప్రమాదాన్ని కూడా పెంచుతాయని పేర్కొంటున్నారు. వారానికి 69 లేదా అంతకంటే ఎక్కువ గంటలు పనిచేసే వ్యక్తులు వారానికి 40 గంటలు పనిచేసే వారి కంటే తీవ్రమైన నిస్పృహ లక్షణాలను కలిగి ఉంటారని వివరిస్తున్నారు. అంతేకాకుండా ఐటీ, టేబుల్ వర్క్ లాంటి ఉద్యోగాలు చేసే వారు పది గంటల గంటే ఎక్కువగా కూర్చుంటే మెదడుకు రక్త ప్రసరణ తగ్గడం, ఏకాగ్రత కోల్పోవడం, పనులపై దృష్టి పెట్టలేకపోవడం, డిప్రెషన్, యాంగ్జయిటీ, ఒత్తిడి స్థాయి పెరగడం, హార్ట్ ఎటాక్ వచ్చే ప్రమాదం వంటి ప్రభావాలు పడుతున్నట్లు తేలింది.

**మహిళల పరిస్థితి మరింత దయనీయం..**

పురుషులతో పోలిస్తే మహిళలు అలా అధిక సమయం పని చేయడం చాలా కష్టం. ఒక నివేదిక ప్రకారం మహిళల కంటే పురుషుల వేతనాలు 1.2-1.3 రెట్లు అధికంగా ఉన్నాయి. అంతేకాకుండా ఇంటి పనికి సంబంధించి పురుషుల కంటే మహిళలు రెట్టింపు సమయం వెచ్చిస్తారు. దీంతో పురుషులతో పోలిస్తే వారికి రెస్ట్ తీసుకునే సమయం 24% తక్కువగా ఉంటుంది. దీంతో అధిక పని గంటల కారణంగా మహిళా కార్మికులపై ఒత్తిడి పెరుగుతున్నది. దీంతో కార్మికశక్తిలో మహిళల శాతం రోజురోజుకు తగ్గిపోతున్నదని ప్రపంచబ్యాంకు పేర్కొన్నది.

**కార్మిక చట్టాల ప్రకారం..**

భారత దేశంలో కార్మిక చట్టాలను 2022లో సవరించారు. దాని ప్రకారం సాధారణ పరిస్థితుల్లో వారానికి 48కి మించిన పని గంటలు ఉండకూడదు. ఒకవేళ దాటితే అదనపు గంటలకు రెట్టింపు జీతం ఇవ్వాలి. అయితే ఇందులో భోజనం చేసే సమయం, ఆఫీసుకు వెళ్లి వచ్చే ప్రయాణం లెక్కలోకి రాదు. చాలా దేశాలతో పోల్చుకుంటే మన దగ్గర పని గంటలు ఎక్కువే. అమెరికా, చైనా, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా లాంటి దేశాల్లో ఇది 40 గంటలే. ఆస్ట్రేలియాలో అయితే 38 గంటలు. అయితే ఓ వైపు అధిక పని గంటలతో మరణాలు సంభవిస్తుండగా.. మరోవైపు నిరుద్యోగ శాతం కూడా ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకు పెరిగిపోతున్నది. భారత దేశంలో సంభవిస్తున్న ఆత్మహత్యలలో పదిశాతం నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులే కారణంగా తేలుతున్నది. నిరుద్యోగ యువతలో 2 శాతం మందికి 30 ఏండ్లకు కూడా ఉద్యోగాలు దొరకడం లేదు. ఇదిలా ఉంటే.. మరోవైపు తమ దేశాల్లో పనిగంటలు, పనిదినాలు తగ్గించాలని, నాలుగు రోజుల పనివారాన్ని అమలు చేయాలని వివిధ దేశాలు ప్రయత్నాలు చేస్తుండగా.. మరికొన్ని దేశాల్లో మాత్రం వ్యాపార, పారిశ్రామిక వేత్తలు పని గంటలు పెంచాలని చెబుతుండడం విమర్శలకు తావిస్తున్నది.

-ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, 9640466464

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం




**వాస్తవ నేస్తం,జుక్కల్:** నియోజకవర్గంలోని దోతి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, దోతీ మాజీ సర్పంచ్ కాశీనాథ్ పటేల్, దేవదాస్ పటేల్, మాజి సర్పంచ్ సోమూర్ సంగ్రం పటేల్, రచప్ప పటేల్, శ్రీకాంత్ పటేల్, శివరాజ్ పటేల్, హన్మంత్, సుభాష్ పటేల్, భాస్కర్ పటేల్, మహేష్, లయన్స్ క్లబ్ ఐ హాస్పిటల్ క్యాంప్ ఇంచార్జ్ హనుమంతరావు పటేల్, డాక్టర్ సతీష్, సిబ్బంది, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## ప్రజావాణి మొత్తం ధరఖాస్తులు.. 66

**సిద్దిపేట :** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆద్వర్యంలో ప్రజావాణి కార్యక్రమ నిర్వహణ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలు పరిష్కరించుకొవడానికి అర్జిదారులు ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ, శ్రీనివాస్ రెడ్డి తో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడిస్ కి అర్జి పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. ప్రజా వాణి అనేది గొప్ప కార్యక్రమం. సామాన్యులకు అందుబాటులో ఉండి తమ సమస్యలను విన్నవించుకుని పరిష్కరించుకొవడానికి ఒక చక్కని వేదిక ఈ ప్రజావాణి. సమస్యలు పట్టుకుని ఎంతో నమ్మకం తో కార్యాలయం కి వచ్చిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే విధంగా పని చేయ్యాలని జిల్లా అధికారులకు తెలిపారు. భూ సంబంధిత, రెండు పడక గదుల ఇళ్ళు, ఆసరా పింఛన్లు ఇతరత్రా మొత్తం కలిపి 66 దరఖాస్తులు వచ్చాయి.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, డిఆర్డిఎ పీడి జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ ఎస్, మహేందర్

**ఖమ్మం:** జిల్లా ఎస్పి డి. ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశానుసారం జిల్లా అదనపు ఎస్పి అడ్మిన్ ఎస్. మహేందర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఫిర్యాదు దారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. ఈ కార్యక్రమంలో టేక్మాల్ మండలం పాల్వంచ గ్రామానికి చెందిన పులి మల్లేషం తన స్వంత భూమి అగు సర్వే 235/అ గల దానిలో పత్తి చేను వేసినాని మా గ్రామానికే చెందిన కొందరు వ్యక్తులు 11.07.2024 నాడు అందాదా ఉదయం 8.30 గంటలకు ఎడ్ల గుంటుకతో మా పత్తి చేనును దున్ని వేసినారని అడిగితే నిన్ను నీ కుటుంబాన్ని చంపేస్తామని బెదిరిస్తున్నారని పత్తి చేను ద్వంసమ్ అయి లక్ష రూపాయల నష్టం అయిందని కావున మాకు నష్టం కలిగించి మమల్ని చంపుతామని బెదిరించిన వారి పై చట్టపరమైన చర్య తీసుకుని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయమని చిన్న అల్లాదుర్గ్ సిఐ సూచనలు చేయటం జరిగింది. అలాగే మెదక్ పట్టణానికి చెందిన మ్యాదరి రమ యాదగిరి అనే వ్యక్తి 9.07.2024 నాడు గడ్డపారతో నా యొక్క ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లో ఉన్న టీవిని పగలకొట్టాడని అడిగితే తన పై దాడికి వస్తున్నాడని కావున అతని పై చట్ట పరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయమని మెదక్ పట్టణ సిఐ సూచనలు చేయటం జరిగింది.

## కరస్పాండెంట్ పై చర్యలు తీసుకోవాలి డి ఎస్ ఎఫ్

**ఆదోని :** పట్టణంలో నర్సింగ్ ఒకేషనల్ నేషనల్ స్కూల్ లో హాస్టల్ లో ఉంటేనే సీటు ఇస్తామని చెప్పడం చాలా దారుణం తక్షణమే కరస్పాండెడ్ పై చర్యలు తీసుకోవాలి.....ఆూఈ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ సార్ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది నర్సింగ్ ఒకేషనల్ నేషనల్ పాఠశాలపై తక్షణమే విద్య అధికారులతో విచారణా జరిపి తాగిన చర్యలు తీసుకుంటాం అని సబ్ కలెక్టర్ మాట్లాడుతూ× ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టబట జిల్లా ఉపాధ్యక్షుడు ధనాపురం ఉదయ్ మాట్లాడుతూ ఆదోనిలో నర్సింగ్ ఒకేషనల్ నేషనల్ స్కూల్ లో ఫీజుల దందాకు అడ్డు లేకుండా పోతుంది ఉఔఓ,ంఔఓ కోర్స్ చదవాలి అంటే 60000. రూపాయిలు ఫీజ్ కట్టాలి ఫీజు చెల్లించిన కూడా చదువుకోవడానికి విద్యార్థులకు సరైన సదుపాయాలు లేవు ప్రాక్టికల్స్ చేయాలంటే కర్నూల్ కి పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందిఅలాగే హాస్టల్లో ఉంటేనే సీటు ఇస్తాము అని చెప్పడం చాలా దారుణమైన పరిస్థితి ఏర్పడింది అలాగే సౌకర్యాలు లేకున్నా కూడా ఏ విధంగా అంత ఫీజు వసూలు చేస్తున్నారని డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ డి.ఎస్.ఎఫ్ విద్యార్థి సంఘంగా అడుగుతున్నాము ఇంత జరుగుతున్నాకూడా విద్యా అధికారులు పటించుకొకపోవడం దారుణం మరియు కళాశాలలో ఏమైనా ఫీజుల గురించి కని సమస్యలు గురించి మాట్లాడాలి అంటే కరస్పాండెంట్ కర్నూలులో ఉన్న పరిస్థితి ఏర్పడుతుంది. కేవలం పాఠశాల లాభదేవాల కోసమే నడుపుతున్న పరిస్థితి ఆదోనిలో ఏర్పడింది కావున ఇప్పటికైనా విద్యాధికారులు తక్షణమే ఒకేషనల్ నర్సింగ్ నేషనల్ స్కూల్ పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యాధికారులు కోరుతున్నాము.. అలాగే సబ్ కలెక్టర్ సార్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది తక్షణమే నేషనల్ ఒకేషనల్ నర్సింగ్ పాఠశాల పై విచారణ జరిపిస్తాను అని హామీ ఇవ్వడం జరిగింది లేనియెడల ఆూఈ అధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు మాట్లాడడం జరిగింది ఈ సమావేశంలో డిఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు వినీల్ మండల అధ్యక్షుడు రాజ్ కుమార్ సూరి అభిషేక్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే

**బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి**

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**జగిత్యాల :** బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. భూ తగాదాలు,ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని అధికారులకు సూచించారు . గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు.

# మ్యాటర్ వీక్ ఉన్నప్పుడే.. ప్రచారం పీక్‌లో ఉంటుంది

**రేవంత్‌పై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు**



**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో కాటమయ్య రక్షణ కవచం కిట్ల పంపిణీ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గౌడన్నల పట్ల సీఎం రేవంత్ రెడ్డి దుర్మార్గంగా ప్రవర్తించాడు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గంటల తరబడి గౌడన్నల ను చెట్ల మీద ఉంచడం సరికాదన్నారు.మానవత్వం ఉన్న నాయకుడెవరూ ఇటువంటి వికృత చేష్టలకు పాల్పడడు అని నిప్పులు చెరిగారు కేటీఆర్. గౌడన్నలను ఆ చెట్ల మీద అంతంతసేపు నిలబెట్టి, వారి వృత్తి మీద చౌకబారు జోకులు వేస్తూ, దాన్ని ప్రచారానికి వాడుకోవడం అమానవీయం, దుర్మార్గం అని ధ్వజమెత్తారు. మ్యాటర్ వీక్ ఉన్నప్పుడే.. ప్రచారం పీక్‌లో ఉంటుంది అని మీ మతిలేని చర్యలు చూసి తెలంగాణ ప్రజలకు అర్థమవుతోందని కేటీఆర్ పేర్కొన్నారు.

గౌడన్నలకు అధునాతన మోకులు.. బీఆర్ఎస్ హయాంలోనే రూపకల్పన తాటిచెట్టుపై నుంచి పడి ప్రతి సంవత్సరం ఎంతోమంది కల్లుగీత కార్మికులు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో వాటి నివారణకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సేఫ్టీ మోకులు రూపొందించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా బీసీ సంక్షేమశాఖకు బాధ్యతలు అప్పగించి దాదాపు రూ. 8 కోట్లు కేటాయించింది. బీసీ సంక్షేమశాఖ ఆ బాధ్యత ను ఓ ఏజెన్సీకి అప్పగించింది.ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఆ ఏజెన్సీ సేఫ్టీ మోకులను రూపొందించింది. అప్పుడే వాటిని పంపిణీ చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేయగా ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయింది. ఇప్పుడు 'కాటమయ్య రక్షణ కిట్లు' పేరిట కాం గ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తున్నవి అవే. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల మందికి అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో సేఫ్టీమోకు రూ. 9 వేలపైనే ఉంటుందని అధికారులు తెలిపారు.

## ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడించిన అంగన్వాడి టీచర్స్

**భద్రాచలంకొత్తగూడెం :** జీఓ నెంబర్ 10 రద్దు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ ను పెంచుతూ విఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని, అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ కు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం మెనుఫాస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని కోరుతూ మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ను సిఐటి యు యూనియన్ ఆధ్వర్యంలో ముట్టడించిన అంగన్వాడీ టీచర్స్ హెల్పర్ లు, తమ న్యాయమైన డిమాండ్లను నెరవే ర్చాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కు మెమోరాండం అందజేశారు. అంగన్వాడీ టీచర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ, గత ప్రభుత్వం హయాంలో తమ సమస్యల పరిష్కారం కోరుతూ 24 రోజులు నిరసన వ్యక్తం చేసిన అంగన్వాడి ఉద్యోగులకు నాటి సీఎం పదవి విరమణ సమయంలో అంగన్వాడీ ఉపాధ్యాయులకు రెండు లక్షలు ఆయాకు లక్ష రూపాయలు బెన్ఫిట్ ఇస్తామని ప్రకటించారని కానీ కొత్తగా వచ్చిన ప్రభుత్వం లక్ష రూపాయలు ఉపాధ్యా యులకు 50,000 ఆయాలకు ఇస్తామని ప్రకటించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు... అధికారంలోకి వచ్చే ముందు 18 వేల రూపాయలు వేతనం వచ్చేలా చేస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి ఆ హామీని నిలబెట్టుకోవాల న్నారు, జీవో నెంబర్ పదిని రద్దుచేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రెండు లక్షలు

## రెండున్నర సం" నిండిన పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలి

**జగిత్యాల :** రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని సిడిపిఓ వీరలక్ష్మి తెలిపారు..జగిత్యాల ఐసిడిఎస్ ఆధ్వర్యంలో "అమ్మ మాట- అంగన్వాడి బాట" పేరుతో అవగాహన ర్యాలీని నిర్వహించారు. జగిత్యాల మున్సిపల్ పరిధిలోని విద్యానగర్ అంగన్వాడి కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సిడిపిఓ వీరలక్ష్మి పాల్గొని తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఓ వీరలక్ష్మి మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రానికి వచ్చే పిల్లలకు కొత్త సిలబస్ ప్రకారం ప్రీ స్కూల్ విద్యను అందించడం జరుగుతుందన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com